# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 127 గుంటూరు, శనివారం 17- 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో



- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## తిరుపతిలో అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం: సీఎం చంద్రబాబు



**జనవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్):**యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు ప్రభుత్వం సంసిద్ధం కావాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతోపాటు వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచి దృష్టి పెట్టాలని సూచించారు. తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఉన్నతాధికారులతో సీఎం భేటీ..

ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం భేటీ అయ్యారు. సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. వివిధ రంగాల్లో కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ల డివైజెస్-సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు కీలకం కానున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోందని వివరించారు.కంపెనీలను ప్రోత్సహిస్తాం..

ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. దేశంలో మొదటిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు వివిధ స్టార్టప్ కంపెనీలకు ఏపీ వేదికగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు భవిష్యత్‌లో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేస్తామన్నారు. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. వీటికి ప్రభుత్వం వైపు నుంచి అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరమన్నారు.

కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు..

తిరుపతిలో ఏర్పాటు చేసే ఏపీ-ఫస్ట్ వ్యవస్థ అవసరాలను తీర్చేలా ఉండాలని ఆదేశించారు. ఏపీలోని యువతకు సహకరించేలా పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్‌లో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కానుందని చెప్పారు. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్రంతోనూ సంప్రదింపులు జరపాలని సీఎం సూచించారు.

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ ప్రపంచంలోనే పెద్దది.. దేశంలో మొదటిది

**నేడు భారీ యంత్రాల ఏర్పాటుకు శ్రీకారం.. హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్**

**1.5 ఎంటీపీపీ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు**

**దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్**

**7.5 గిగావాట్ల సోలార్, విండ్ ఎనర్జీ కూడా**

**2 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంటు ఏర్పాటు**

**3 దశల్లో మొత్తం రూ.90 వేల కోట్ల పెట్టుబడి**

**2027 నాటికి తొలి దశ ఉత్పత్తి ప్రారంభం**

**గ్రీన్‌కోకు చెందిన ఏఎం గ్రీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు**



**క్రైమ్ కౌంటర్ న్యూస్):**అమరావతి/కాకినాడ, జనవరి 16: క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టించనుంది. ప్రపంచంలోనే అతిపెద్దది.. దేశంలోనే మొదటి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు రాష్ట్రం వేదిక కానుంది.కాకినాడ కేంద్రంగా.. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ సంస్థ ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కాంప్లెక్స్ నుంచి గ్రీన్ అమ్మోనియా జర్మనీ, జపాన్‌కు ఎగుమతి కానుంది. కేవలం ఏడాది కాలంలో అన్ని అనుమతులూ పొంది శరవేగంగా నిర్మాణం జరుపుకొంటున్న ఈ ప్రాజెక్టులో భారీ యంత్ర పరికరాల ఏర్పాటు ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన 'ఏఎం గ్రీన్' సంస్థకు గత ఏడాది జనవరిలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తూ జీవో విడుదల చేసింది. 10 బిలియన్ యూఎస్ డాలర్ల(సుమారు రూ.90 వేల కోట్లు) పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో సు మారు 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆపరేషన్స్, పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, నిల్వ లు, పోర్టు సేవలు వంటి అనుబంధ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించనున్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా దేశీయంగా ఉత్పత్తి చేసిన గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తులు జర్మనీ, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి కానున్నాయి.ఏఎం గ్రీన్ సంస్థ.. గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి కార్బన్ ఉద్గారాలు లేకుండా గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. బొగ్గు, చమురు, సహజవాయువులతో తయారయ్యే గ్రే, బ్లూ అమ్మోనియాకు భిన్నంగా ఈ ఉత్పత్తి జరగనుంది. ప్రపంచం మొత్తం డీ-కార్బనైజేషన్, నెట్ జీరో ఎమిషన్స్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా భవిష్యత్తు ఇంధనాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడలో 'ఏఎం గ్రీన్ అమ్మోనియా' ప్రాజెక్టు దేశానికే గర్వకారణంగా నిలవనుంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ పాత గ్రే అమ్మోనియా ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 495 ఎకరాల్లో ఏఎం గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టును 3 దశల్లో పూర్తి చేయనున్నారు. తొలిదశలో 2027 నాటికి ఏడాదికి 0.5 టన్నుల అమ్మోనియాను ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలిదశలో రూ.18 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. రెండో దశలో 2028 నాటికి టన్ను, మూడో దశలో 1.5 టన్నుల అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్ని దశల్లోనూ గ్రీన్ ఎనర్జీని మాత్రమే వినియోగించుకునే ఏకైక ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు దేశంలో ఇదేనని అధికారులు తెలిపారు. గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి అవసరమయ్యే విద్యుత్తు కోసం 7.5 గిగావాట్ల సోలార్, విండ్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీకి 1950ఎంవీ సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరాయంగా విద్యుత్తును అందించేందుకు 2జీవీ సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రాజెక్టు అవసరాలన్నింటికీ గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునే ప్లాంటు దేశంలో ఇదే మొదటిది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.90వేల కోట్లుగా అధికారులు చెబుతున్నారు.

ఎగుమతికి అద్భుత అవకాశం

ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ కాకినాడ పోర్టుకు కిలోమీటరు దూరంలో ఉంటుంది. గ్రీన్‌అమ్మోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు ఈ వెసులుబాటు అద్భుత అవకాశం కల్పిస్తుంది. ఏఎం గ్రీన్ సంస్థ ఇప్పటికే జర్మనీకి చెందిన యూనిఫర్ ఎస్‌ఈతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు ఓ పారిశ్రామిక పెట్టుబడి మాత్రమే కాదని, రాష్ట్ర ఇంధన భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దీని ద్వారా దేశంలోనే తొలిసారిగా జర్మనీ, సింగపూర్, జపాన్‌కు గ్రీన్ అమ్మోనియా ఎగుమతి జరగనుందని తెలిపారు.

## మందుబాబులకు పండగే!



**క్రైమ్ కౌంటర్ న్యూస్):**అమరావతి, జనవరి 16 తెలుగువారికి సంక్రాంతి పండుగ ఎంత ముఖ్యమైనదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా రెక్కలు కట్టుకుని మరీ సొంతూళ్లలో వాలిపోతుంటారు. పండుగ సరదాలు, సంబరాలు, మందు, విందులు కూడా అంతేస్థాయిలో ఉంటాయి. మద్యం విక్రయాల లెక్కలు చూస్తుంటే గత మూడ్రోజుల్లో.. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో మందు బాబులు మద్యంలో మునిగి తేలినట్లు కనిపిస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి. కోడిపందేల బరులు పెరగడం కూడా ఈ విక్రయాలపై ప్రభావం చూపింది. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. వీటన్నిటి కారణంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు బాగా పెరిగాయి. రాష్ట్రంలో రోజూ రూ.85 కోట్ల అమ్మకాలు జరుగుతాయి. సాధారణ రోజుల్లో జరిగే అమ్మకాల కంటే జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రెట్టింపు పెరిగాయి. ఆ వారంలో రూ.877 కోట్ల లిక్కర్ విక్రయాలు జరుగగా.. ఒక్క భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లోనే రూ.438 కోట్లు అమ్మారు. ఈ ఏడాది కొత్త సంవత్సరం సందర్భంగా కూడా మద్యం ఏరులైపారింది. డిసెంబరు 29 నుంచి జనవరి 1 వరకు 4 రోజుల్లోనే రూ.543 కోట్ల విలువైన మద్యాన్ని షాపులు, బార్ల లైసెన్సీలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి మూడు త్రైమాసికాల్లో రూ.22,983 కోట్ల విక్రయాలు జరిగాయి.


## గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ: మంత్రి లోకేశ్



**అమరావతి, జనవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్)::** ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలో భారీ గ్రీన్ అమోనియా ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా అవతరించనుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కాకినాడలో గ్రీన్ అమోనియా సంస్థ 1.5 ఏమ్‌టీపీపీఏ సామర్థ్యంతో ఎగుమతి టెర్మినల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దాంతో 7.5 గిగావాట్ల రిన్యూవబుల్ ఎనర్జీతో విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు. అలాగే 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ వినియోగం చేయనుందన్నారు లోకేశ్. తద్వారా భారత్ నుంచి తొలిసారిగా విదేశాలు.. జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు ఈ గ్రీన్ ఎనర్జీని ఎగుమతి చేస్తామని తెలిపారు. అందుకు 10 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతున్నట్లు వివరించారు. దీని ద్వారా 8 వేలకు పైగా ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు. దీనిపై శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కీలక ప్రకటన చేస్తామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## ఒకే క్లిక్‌తో పీఎం కిసాన్‌కు నిమిషాల్లోనే అప్లై చేసుకోవచ్చు.

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా నగదును రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేసింది. ఏడాదిలో మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున అందిస్తోంది. నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.6 వేలు అకౌంట్లలో జమ చేస్తోంది. గత ఏడాది నవంబర్‌లో 21వ విడత డబ్బులను విడుదల చేయగా.. 22వ విడత డబ్బులను వచ్చే నెలలో విడుదల చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ తన చేతుల మీదుగా బటన్ నొక్కి డబ్బులు రిలీజ్ చేయనున్నారు. 10 కోట్ల మంది లబ్ధిదారులు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది రైతులు పీఎం కిసాన్ లబ్ధిదారులుగా ఉన్నారు. అర్హత పొందిన వారి నుంచి కేంద్రం ఎప్పటికప్పుడు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎప్పుడైనా ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి గడువు విధించలేదు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు మీ వివరాలు, డాక్యుమెంట్లు పరిశీలించి లబ్ధిదారుల జాబితాలో చేర్చుతారు. అనంతరం మీ అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి. ఎలా ఆన్‌లైన్‌లో పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు



చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

# సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించిన గంగారావు

## సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మెరిసిన మహిళలు.. విజేతలకు బహుమతులు అందించిన సినీ నటి గీత సింగ్



**(క్రైమ్ కౌంటర్) (నాయక్)** (బెల్లంకొండ )మండలం చంద్రాజుపాలెం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ గంగారావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కితకితలు హీరోయిన్ గీత సింగ్ సీరియల్ నటి జాను ప్రొడ్యూసర్ గిరి రాజు పాల్గొన్నారు పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ గంగారావు నిర్వహించిన ముగ్గుల పోటీలకు గ్రామంలోని మహిళలు యువతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, ఎంతో ఆహ్లాదకరంగా పండగ వాతావరణం లో ముగ్గులు వేయడం జరిగింది పోటీల్లో మహిళలు వేసిన రంగురంగు ముగ్గులు గొబ్బెమ్మలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మొదటి ద్వితీయ తృతీయ బహుమతులను గంగారావు ప్రకటించగా విజేతలకు కితకితలు హీరోయిన్ గీత సింగ్ చేతుల మీదగా బహుమతులను అందజేయడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని మహిళలకు సీరియల్ నటి జాను చేతుల మీదుగా చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కితకితలు హీరోయిన్ గీత సింగ్ మాట్లాడుతూ మన సంప్రదాయలను ప్రతిబింబించే ఇలాంటి పోటీలను నిర్వహించటం అభినందనీయం అని అన్నారు గంగారావు అంటే మాకు చాలా గౌరవం అని కరోనా టైంలో చిన్న చిన్న ఆర్టిస్టులు కు తమ వంతు సహాయ సహకారాలు అందించిన గొప్ప మనసున్న వ్యక్తి గంగారావు అని అన్నారు, ఆయనను మేము ముద్దుగా లిగంగుబాయ్‌లిఅని పిలుసుకుంటామన్నారు సంక్రాంతి పండుగ సందర్భంగా మమల్ని ఇక్కడకు ఆహ్వానించి మా చేతుల మీదగా ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేయటం చాలా ఆనందంగా ఉందని ఇక్కడకు వచ్చాక తెలిసింది ఆయన ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టి ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన ఇంకా గొప్పస్తాయి కి వెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. అదేవిధంగా ఇంత కార్యక్రమం నిర్వహించినా నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు మాట్లాడుతూ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ కుమార్ చేస్తున్న మంచి కార్యక్రమాలు చూస్తూ ఆయన అడుగుజాడలలో నడవాలని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా వచ్చిన కితకితల సినిమా హీరోయిన్ గీత సింగ్ సీరియల్ నటి జాను ప్రొడ్యూసర్ గిరి రాజు ముఖ్య అతిథులుగా రావటం చాలా సంతోషమని వారికి నా తరపున మా గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ఆయన అన్నారు,సినీ ఆర్టిస్ట్ లు రాకతో ఈ సంక్రాంతి సంబరాలు ఎంతో కలర్ ఫుల్ గా మారాయి అన్నారు కళాకారుల ప్రోత్సాహంతో ముగ్గులు పోటీ విజేతల్లో కొత్త ఉత్సాహం నిండింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం కు గ్రామపెద్దలు వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు సంఘం పెద్దలు సహాయ సహకారాలు తో నిర్వహించిడం జరిగింది వారికి నా యొక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు బహుమతులు అందజేసిన తర్వాత గ్రామ కమిటీ సభ్యులు గంగారావు ముఖ్య అతిథులుగా వచ్చిన సినీ ఆర్టిస్టులను దుశ్యాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ముద్దా విజయ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్చు రాంబాబు మణికంఠ నితీష్ వెంకటగిరి ఏసు పాదం లక్ష్మయ్య బత్తుల శీను ఉప్పు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు



# సైబర్ లింకులపై అప్రమత్తంగా ఉండాలి.??

## పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య

**పెద్దవడుగూరు క్రైమ్ కౌంటర్ న్యూస్ జనవరి 16 రిపోర్టర్ సి రాము :** దేశవ్యాప్తంగా సైబర్ మోసాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాట్సాప్ లలో లింకులు ఎక్కువ మందికి షేర్ చేస్తే యాప్ లో మీకు 5000 వస్తాయని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారంపై పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య స్పందించారు. వివిధ మార్గాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించి దోచుకుంటున్నారని ఈ లింకుల వెనక మోసగాళ్లకు కుట్ర దాగి ఉండవచ్చని ఒక్కసారి క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

# రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన



**ఎద్దవడుగూరు క్రైమ్ కౌంటర్ న్యూస్ జనవరి 16 రిపోర్టర్ సి. రాము :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గాంధీ విగ్రహము వద్ద రైతు సంఘం సీనియర్ నాయకులు వై. సూర్యనారాయణ రెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చాభిలకు మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొస్తున్నటువంటి నూతన వ్యవసాయ విత్తన మార్కెటింగ్ చట్టం రైతు వ్యతిరేక విద్యుత్ సంస్కరణల 2025వ బిల్లు మరియు వేతన చట్టం 44 లేబర్ కూడలను రద్దుచేసి నాలుగు చట్టాల బిల్లు వికసితు భారత్ రాంజీ చట్టము విరమించుకోవాలని కోరుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోలారంగస్వామి, రైతు సంఘము నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఓమిరెడ్డి, ఆది రంగారెడ్డి,గంగన్న,అల్లా బకాష్,చారు గుండ్ల వెంకట్రాముడు,బద్దెల రాజు, బద్దెల రామాంజనేయులు, పప్పు నారాయణస్వామి, బండారు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మరపురాని జ్ఞాపకం మా తమ్ముడు

**బిక్కవోలు క్రైం కౌంటర్ జనవరి 16** తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం స్వర్గీయ ద్వారంపూడి వీరెడ్డి కుమారుడు కాశీ విశ్వనాథ రెడ్డి పుట్టినరోజు సందర్బంగా ఈ రోజు తల్లి సూరయ్యమ్మ అక్క బావలు కర్రి ఆది లక్ష్మి రామ కృష్ణా రెడ్డి లు కె అర్ కె సంక్షేమ చారిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు మూడు పూటలా అన్నదానం జరిపి వారి ఆకలి తీర్చారు. తన తమ్ముడు విశ్వనాథ రెడ్డి ఎంతో ఆత్మీయత అనుంబంధం తో ఉండేవాడని, అన్ని వేళలా తమకు తోడుగా ఉండే మా మామయ్య అంటే మాకు ఎంతో ప్రేమ అని మేనకోడలు స్వాతి, మేనల్లుడు సూర్య తెలిపారు. ఈ అన్నదానం లో పాల్గొని ఆకలి తీర్చుకొన్న నిరుపేదలు విశ్వనాథ రెడ్డి కుటుంబం ను ఆశీర్వదించారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెడితే ఆది అ పరమేశ్వరుడికి సేవ చేసినట్లే అని తద్వారా అన్నం పెట్టిన వారికి అ పరమేశ్వరుడి ఆశీస్సులు ఉంటాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ సందర్బంగా ట్రస్ట్ చైర్మన్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ విశ్వనాథ రెడ్డి తనకు బావమరిది గానే కాకుండా ఒక ఆత్మీయుడిగా ఎంతో తోడుగా ఉండేవాడని తెలిపారు. తనతో ఉన్న జ్ఞాపకాలు ఎప్పటికి మరువలేమని తెలిపారు.



# గంగారావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు పాల్గొన్న సినీ నటులు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బిసి సెల్ అధ్యక్షులు నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన గుంజా గంగారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాలతో శుక్రవారం సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు . ముఖ్య అతిథులుగా సినీనటి గీతసింగ్, సీరియల్ నటి జాను, ప్రొడ్యూసర్ గిరిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగారం సహకారంతో మహిళలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి ముగ్గుల పోటీల్లో భారీగా పాల్గొన్న మహిళలు. విజేతలకు బహుమతులు అందించిన సినీ నటి గీత సింగ్ . ముగ్గుల పోటీలకు గ్రామంలోని మహిళలు యువతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలకు సీరియల్ నటి జాను చేతుల మీదుగా గంగారావు ఏర్పాటుచేసిన 30 చీరలను అందించారు. హీరోయిన్ గీత సింగ్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయలను ప్రతిబింబించే ఇలాంటి పోటీలను నిర్వహించటం అభినందనీయం అని, గంగారావు అంటే మాకు చాలా గౌరవం అని, కరోనా టైంలో చిన్న చిన్న ఆర్టిస్టులు కు తమ వంతు సహాయ సహకారాలు సినీ నటులకు, జబర్దస్త్ ఆర్టిస్టులకు అందించిన మంచి మనసున్న వ్యక్తి గంగారావు అన్నారు. భవిష్యత్తులో గంగారావు గారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సినీ ఆర్టిస్టులు గీత సింగ్ ,జాను, ప్రొడ్యూసర్ గిరి కోరుకున్నారు. గుంజా గంగారావు మాట్లాడుతూ గౌరవ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ గారు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గీతసింగ్ గారు సీరియల్ నటి జాను, ప్రొడ్యూసర్ గిరి రాజు ముఖ్య అతిథులుగా రావటం చాలా సంతోషమని వారికి నా తరపున మా గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు గంగారావు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించడం సంతోషంగా ఉందని సినీ నటులు తెలిపారు. చంద్రాజుపాలెం గ్రామపెద్దలు , వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు, సంఘం పెద్దలు, సహాయ సహకారాలు తో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని గ్రామంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. గ్రామ కమిటీ సభ్యులు, గంగారావు సినీ ఆర్టిస్టులను దుశ్యాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ముద్దా విజయ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్చు రాంబాబు, మణికంఠ, నితీష్, వెంకటగిరి ,ఏసు పాదం, లక్ష్మయ్య, బత్తులశీను, ఉప్పు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు

# జస్టిస్ యశ్వంత్ వర్మకు దక్కని ఊరట.. విచారణకు తొలగిన అడ్డంకి

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** న్యూఢిల్లీ, జనవరి 16: జస్టిస్ యశ్వంత్ వర్మకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. అభిశంసనపై పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా జస్టిస్ వర్మ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అభిశంసనపై పార్లమెంట్ సంయుక్త కమిటీనే ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. సుప్రీం కోర్టు నిర్ణయంతో పార్లమెంటు కమిటీ విచారణకు అడ్డంకి తొలగింది.ఇంతకీ ఏం జరిగిందంటే.. 2025, మార్చి 14వ తేదీన రాత్రి 11:35 గంటల ప్రాంతంలో తుగ్లక్ క్రెసెంట్‌లోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఆర్పడానికి బంగ్లాకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది ఇంట్లోని ఓ గదిలో కాలిపోయిన నగదును కనుగొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో మార్చి 15వ తేదీన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు ఢిల్లీ హైకోర్టు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మార్చి 20వ తేదీన జస్టిస్ వర్మ నివాసంలో సగం కాలిపోయిన నగదు దొరికినట్లు పలు జాతీయ మీడియాలు వార్తలను ప్రసారం చేశాయి. దీంతో లోతైన దర్యాప్తుకు మద్దతుగా ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేకి లేఖ రాశారు. ఈ ఘటన తర్వాత జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అంతర్గత దర్యాప్తు కోసం ఆదేశించింది. విచారణ కోసం కమిటీని ఏర్పాటు చేసింది. జస్టిస్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని త్రిసభ్య కమిటీ తేల్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు నివేదిక అందించింది.

పార్లమెంట్‌లో అభిశంసన



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలు దొరికిన ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో పార్లమెంట్ ఆయనపై చర్యలకు సిద్ధమైంది. 2025 ఆగస్టు నెలలో జస్టిస్ వర్మను తొలగించాలని కోరుతూ ఎంపీలు ఉభయ సభల్లో మెమొరాండం సమర్పించారు. లోక్‌సభలో అభిశంసన తీర్మానంపై 145 మంది ఎంపీలు సంతకాలు చేశారు. రాజ్యాంగంలోని 124, 217, 218 నిబంధనల కింద ఈ నోటీసు ఇచ్చారు. తర్వాత పార్లమెంట్ కమిటీ ఏర్పాటైంది. అభిశంసనపై పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

## నియోజకవర్గ పార్టీ క్యాడర్ తో ఎమ్మెల్యే ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** అమరావతి గ్రామంలో శుక్రవారం పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు కనుమ పండుగ వేళ నియోజకవర్గ పార్టీ క్యాడర్ తో కాఫీ కబుర్లతో మమేకమై పార్టీకి సంబంధించిన పలు విషయాలు కీలక నేతలతో చర్చించారు

# ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** సంక్రాంతి సందర్భంగా తమ స్వగ్రామం గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో జరిగిన దేవుని ఊరేగింపులో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆయన సతీమణి లావణ్య , సోదరుడు నవీన్ మరియు నవీన్ సతీమణి దీప్తి తదితరులు

# కబాడీ ఛాంపియన్షిప్ పోటీలకు హాజరైన తెనాలి



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం :** ఈద్పుగల్లు సీతారామ గార్డెన్ లో నందమూరి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ నేషనల్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్



ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## ఐ హెచ్ఆర్ఎఫ్ సంస్థ స్టేట్ డైరెక్టర్ గా అంజిన్నయ్య. కు పదోన్నతి




**క్రైమ్ కౌంటర్ న్యూస్ : కర్నూలు** నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కర్నూలు జిల్లా చైర్మన్ గా జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తూ అనేక ప్రజా సమస్యల పరిష్కారం కొరకు మరియు నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తూ మానవ హక్కుల పరిరక్షణకై కృషి చేస్తూ అందరికీ సమన్యాయం చేస్తు ఎన్నో సేవలు అందిస్తూ సకాలంలో న్యాయం చేస్తూ సేవలందిస్తున్న వారి సేవలను గుర్తించి గోనెగండ్ల మండలానికి చెందిన టి.అంజినయ్య గారికి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ×ఎ=ఖీ ఏపీ స్టేట్ డైరెక్టర్ గా నియమిస్తూ సెంట్రల్ న్యూఢిల్లీ నుండి శుక్రవారం కార్యాలయం నుండి ఐ హెచ్ఆర్ఎఫ్ నేషనల్ చైర్మన్ సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది గౌరవ కె .అనిల్ కుమార్ గారు మరియు ఈ ఐహెచ్ఆర్ఎఫ్ నేషనల్ వైస్ చైర్మన్ ఆర్ కె .కంబగిరి స్వామి గారు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు అంతరం కంబగిరి స్వామి మాట్లాడుతూ ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ మరియు బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు డ్రగ్స్ నిషేధం రాజ్యాంగ పరిరక్షణ ధ్యేయంగా సంస్థ నియమ నిబంధనలతో విధులు నిర్వహించాలని తెలిపారు

# ఏఎంఏ అధ్యక్షుడిగా తెలుగోడు

విజయవాడ, జనవరి 16 అమెరికా వైద్య రంగంలో కృష్ణా జిల్లా వ్యక్తి కీలక పదవిని అధిరోహించారు. అమెరికా మెడికల్ అసోసియేషన్(ఏఎంఏ) అధ్యక్షుడిగా కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుద్ధవరానికి చెందిన బాబి ముక్కామల ఎన్నికయ్యారు. ఏఎంఏను 180 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు అమెరికన్ వైద్యులే దీనికి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ పదవిని అధిరోహించిన భారతీయ మూలాలు ఉన్న తొలి వైద్యుడు బాబి. అతడి తల్లిదండ్రులు డాక్టర్ అప్పారావు, సుమతి. అప్పారావు స్వగ్రామం బుద్ధవరం. ఆయన రేడియాలజి?అబశ్రీశ్రీస్టగా, సుమతి చిన్నపిల్లల వైద్యురాలిగా అమెరికాలో స్థిరపడ్డారు. అప్పారావు దంపతులకు బాబి అమెరికాలోనే జన్మించారు. ప్రస్తుతం మిచిగాన్ రాష్ట్రంలోని ఫ్లింట్ నగరంలో హార్లీ ఆసుపత్రిలో ఈఎన్‌టీ వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఏఎంఏలో ఇంతకుముందు ఆయన ఎనిమిదేళ్లపాటు ట్రస్టీగా పనిచేశారు. ఏటా ఏఎంఏ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. బాబిని అమెరికాలో ఉన్న 10 లక్షల మంది వైద్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. వైద్యరంగంలో అమలు చేయాల్సిన విధానాలు, వైద్యసేవల్లో చేయాల్సిన మార్పులపై ఏఎంఏ అక్కడి ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.

# కోట్లలో కూత దాదాపు రూ.2 వేల కోట్ల పందేలు



**పండగ మూడు రోజులూ 'బరి'లోనే గోదారి**
**తెలంగాణ వాసుల రాకతో జోష్**
**పశ్చిమలో రూ.300 కోట్లు**
**గుండాట, పేకాటల జాతర రూ.500 కోట్లు**
**రూ.800 కోట్లు రాబట్టిన 'కృష్ణా'**
**బాపట్లలో 200 కోట్ల పందేలు**
**తాడేపల్లిగూడెంలో ఒకే పందెం రూ.1.53 కోట్లు**

**క్రైమ్ కౌంటర్ న్యూస్):**సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. కోళ్ల కత్తులు రువ్వి నిర్వాహకుల పంట పండించాయి. కోడిపందేలతోపాటు గుండాట, కోతాటలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మూడు రోజుల్లో రూ.500 కోట్ల వరకు పందేలు తెగినట్టు అంచనా. ఒక్క కాకినాడ జిల్లాలోనే ఏకంగా రూ.250 కోట్ల లావాదేవీలు సాగినట్టు చెబుతున్నారు. ఒక్కో బరి వద్ద మూడు నుంచి నాలుగు గుండాట బోర్డులు ఏర్పాటు చేయించి నిర్వాహకులు లాభాలు వెనకేసుకున్నారు. కరప మండలంలో కోడిపందేలు మూడు రోజులు కలిపి రూ.15 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. తాళ్లరేవులో అధికార పార్టీకి చెందిన ఓ కీలకనేత యానాం రిసార్ట్‌లో 40 గదులు బుక్ చేయించి మూడు రోజులు రేయింబవళ్లు పేకాట ఆడించారు. మూడు బోర్డుల గేమ్ పేకాటలో రోజుకు మొదటి విన్నర్ రూ.కోటి వరకు గెలుచుకున్నారు. మగువలను కూడా తీసుకువచ్చి చిందులేశారు. మొత్తం పేకాట టర్నోవర్ రూ.12 కోట్లని అంచనా. కాకినాడ రూరల్, కరప, ఉండూరు, కందరాడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పందేల వద్ద ప్రవేశ రుసుం కనీసం రూ.1.50 లక్షలుగా ఉంది. ఎక్కడికక్కడ భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పందేలు తిలకిస్తున్న వారికి ఉదయం టిఫిన్, మధ్యలో స్నాక్స్, పలు రకాల వంటలతో మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటుచేశారు. పలు బరుల వద్ద రక్షణ కోసం బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. తునిలో రూ.8 కోట్లకుపైగా పందేలు జరిగాయి. పక్కనే ఉన్న అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి పందెం రాయుళ్లు ఇక్కడకు పోటెత్తారు.

కోనసీమలో పందేల జోరు...

ఫ్లడ్‌లైట్లు, డిజిటల్ స్క్రీన్‌లతో సర్వహంగులతో అంబేద్కర్ కోనసీమ జిలాల్లోని ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఏర్పాటుచేసిన అతిపెద్ద కోడిపందాల బరికి ప్రముఖులు పోటెత్తారు. ఇక్కడ కోట్లాది రూపాయలు చేతులు మారాయి. జిల్లావ్యాప్తంగా వందకుపైగా పందెంబరులతోపాటు వందలాది బోర్డులతో గుండాటలు, పేకాటలు వంటివి జోరుగా సాగాయి. మూడురోజులపాటు సుమారు రూ.150 కోట్ల మేర జూద క్రీడల జాతరలో వెచ్చించినట్టు సమాచారం. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు ముఖ్యంగా మహిళలు కోడిపందాలను తిలకించారు. మురమళ్ల బరి వద్ద పార్లమెంటు సభ్యులు గంటి హరీశ్‌బాలయోగి(అమలాపురం), తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ (కాకినాడ), ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు(ముమ్మిడివరం), గిడ్డి సత్యనారాయణ(పి.గన్నవరం), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నిర్మాత ఆదిత్యరామ్, సినీ నటి హేమ సహా అనేకమంది ప్రముఖులు వీక్షించారు. ఇక రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో 20కి పైగా ప్రాంతాల్లో అశ్లీల రికార్డింగ్ డాన్స్‌లు హోరెత్తిపోయాయి.

'తూర్పు' పందెం రూ.100 కోట్లపైనే

తూర్పుగోదావరి జిల్లాలో చాలాచోట్ల కార్పొరేట్ లెవల్‌లో కోడి పందాలు, గుండాటలు, పేకాటలు జోరుగా సాగాయి. రూ.100కోట్లకుపైగానే చేతులు మారినట్టు అంచనా. మొత్తం 150 వరకూ బరులు నిర్వహించారు. ఒక్కో బరి వద్ద నాలుగు నుంచి ఆరు వరకు గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. ఈసారి బరులను కొంతమంది వ్యక్తులు పాడుకోవడం గమనార్హం. బరిని బట్టి రూ.లక్ష నుంచి కోటి వరకూ పాడుకున్నారు. పందెం కమీషన్లతోపాటు, గుండాట నిర్వాహకులు ఇచ్చే సొమ్ము, పేకాట, మద్యం. ఇతర దుకాణాల నుంచి వచ్చే సొమ్ముతో వీళ్ల లాభాలు గడించారు. ఇక.. పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజులు కలిపి సుమారు రూ. 300 కోట్లు చేతులు మారాయి. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలోని పెద అమిరం, సీసలి బరుల్లో ప్రతి పందెం కనిష్ఠంగా రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు కాశారు.

'బాపట్ల'లో 200 కోట్ల పందేలు

బాపట్ల జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కోడి పందేల్లో దాదాపు రూ.200 కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం. ఒక్క చెరుకుపల్లి మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలోనే పండుగ 3 రోజుల్లో దాదాపు రూ.100 కోట్ల వరకు పందేలు సాగినట్లు అంచనా. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని బరిలో రూ.60 కోట్ల లావాదేవీలు జరగ్గా, వేమూరు పరిధిలో కూడా భారీగానే పందే లు కాశారు. బరుల వద్ద గుండాట, పేకాట యథేచ్ఛగా కొనసాగాయి. ప్రధాన బరుల వద్ద నిర్వహించిన కోడి పందేల్లో ఆరుగురు బుల్లెట్లను గెలుచుకున్నారు. పల్నాడు జిల్లాలో ప్రతి పందేనికి రూ.లక్షల్లో నగదు చేతులు మారింది.

ఏలూరులో 200 కోట్లు తెగాయి

ఏలూరు జిల్లాకు ఈసారి పెద్దఎత్తున తెలంగాణ జిల్లాల నుంచి ప్రముఖులు, పలువురు ప్రజా ప్రతినిధులు పోటెత్తడంతో కోడి పందేలు రంజుగా సాగాయి. భోగి నుంచి కనుమ పండగ శుక్రవారం సాయంత్రం వరకు రూ.200 కోట్ల పైగా పందేలు తెగినట్టు చెబుతున్నాయి. నూజివీడు మండలం మీర్జాపురం పది ఎకరాల బరితో కలిపి, మరికొన్ని బరుల్లో మెట్టగూడెం, నూజివీడు టౌన్, సిద్ధార్థనగర్, ఆగిరిపల్లి, జనార్దనవరం, కోటపాడు, ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు కోడి పందేల్లో రూ.120 కోట్ల పైమాటే చేతులు మారినట్లు అంచనా. ఈసారి పెద్దఎత్తున తెలంగాణ వాసులు, ప్రముఖ రాకలతో శిబిరాలు హైటెక్ సొబగులను అద్దుకున్నాయి. యథేచ్ఛగా గుండాట, పేకాట, లోపల-బయట మ్యాచ్‌ల్లో రూ.100 కోట్ల పైబడి చేతులు మారాయి. కైకలూరులోని భుజబలపట్నంలో ఎమ్మె ల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ మాగంటి బా బు, జబర్దస్త్ అవినాశ్ పందెం పోటీలను తిలకించా రు. ముదినేపల్లి మండలంలో అల్లూరు, పెయ్యేరు, పెదపాలపర్రు, సింగరాయపాలెం-కోరుకొల్లు రోడ్లవద్ద భారీ ఎత్తున పందేలు జరిగాయి. గురు, శుక్రవారాల్లో రూ.5 కోట్ల చేతులు మారాయి. ఏడు బుల్లెట్‌లు, కారు, రెండు హోండా యాక్టివాలను ఎక్కువ పందేలను గెలుచుకున్న వారికి బహూకరించారు. కొయ్యలగూడెం రామానుజపురంలో 4 ఎకరాల తోటల్లో కోడి పందేలు నిర్వహించారు. రూ.3.5 కోట్లు చేతులు మారాయి. లింగపాలెం మండలంలో భారీ పందెలు జరిగాయి. ఇక్కడ యాంకర్ ఆర్‌పి శ్యామల తిలకించేందుకు వ చ్చారు.

# సినిమా



## అభిమానులను మోసం చేశావ్ ఉదయ్..

ఉదయ్ కిరణ్ గురించి చెప్పేది ఏముంది..? పక్కింటి అబ్బాయిలా అనిపించే రూపం.. ముఖంలో తెలియని అమాయకత్వం. అప్పట్లో వరుస లవ్ స్టోరీ హిట్స్ ఇచ్చిన ఉదయ్ అంటే అమ్మాయిలు పడి చనిపోయారు. కానీ ఆ తర్వాత కాలంలో అతను చేసిన సినిమాలు వరసగా పరాజయం అయ్యాయి. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడులకు లోనైన ఉదయ్.. ఆత్మహత్య చేసుకుని ఈ లోకాన్ని వీడారు. అప్పట్లో దిల్ కబడ్డీ మూవీ విడుదల సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఉదయ్.. తన మనసులోని భావాలను పంచుకున్నారు.కెరీర్‌లో గ్యాప్స్ రావడానికి గల కారణాలను వివరిస్తూ, అదృష్టం కలిసి వచ్చి, అనుకూలమైన పరిస్థితులు ఉంటేనే మంచి కథలు వరుసగా వస్తాయని పేర్కొన్నారు. తన ప్రారంభ కెరీర్ లో మంచి కథలను ఎంపిక చేసుకునే అవకాశం లభించిందని, అది తన అదృష్టమని ఆయన గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు చిత్రం వంటి సంచలనాత్మక చిత్రాలతో తెలుగు సినిమాలో ఒక తరం యువతకు ఆరాధ్య తారగా వెలుగొందిన ఉదయ్ కిరణ్, టాలీవుడ్‌లో తదుపరి పెద్ద స్టార్‌గా పేరు పొందారు. కొన్ని పరాజయాలు, పుకార్లు తన కెరీర్‌ను ప్రభావితం చేశాయని వివరించారు. తమిళ సినీ పరిశ్రమలో తన అనుభవాల గురించి మాట్లాడుతూ, అక్కడ చాలా స్క్రిప్ట్‌లు విన్నానని, మూడు సినిమాలు చేశానని తెలిపారు. అయితే, అక్కడ ఒక్క కమర్షియల్ విజయాన్ని కూడా అందించలేకపోయానని నిజాయితీగా అంగీకరించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేస్తానని అప్పట్లో ఆశాభావం వ్యక్తం చేశాడు ఉదయ్. తనపై ఉన్న ప్రశంసలు, విమర్శల గురించి ప్రస్తావిస్తూ, తన పట్ల ఇష్టపడేవారు, ఇష్టపడనివారు, విమర్శించేవారు, అభినందించేవారు ఉంటారని, ఇదంతా బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగే ప్రక్రియ అని అన్నారు. తనపై ఉన్న అనేక విషయాలు, పుకార్లకు తాను ఎప్పుడూ వివరణ ఇవ్వడానికి ప్రయత్నించలేదని ఉదయ్ కిరణ్ స్పష్టం చేశారు. ఎందుకంటే, ఎంతమందికి వివరణ ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ఇది తన స్వభావమని, మాట్లాడటం, వివరణలు ఇవ్వడం తన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ప్రేక్షకులు సినిమాకు వచ్చేది వినోదం కోసమేనని, పాత్రలు దుఃఖిస్తున్నా కూడా వారికి వినోదం లభించాలని అన్నారు. ఆఫీసు టెన్షన్లు లేదా ఇతర ఒత్తిళ్లతో వచ్చే ప్రేక్షకులకు చివరకు మంచి వినోదం అందించడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. ప్రేక్షకులను కథలో లీనం చేసి, వారిని భావోద్వేగాలకు గురి చేయడమే మంచి కథ బలం అని ఉదయ్ కిరణ్ వివరించారు. తన అభిమాన బలం చెక్కుచెదరకుండా ఉందని, ఒక ఫీనిక్స్ పక్షిలా తిరిగి లేచి వస్తానని తన అభిమానులకు ఉదయ్ కిరణ్ హామీ ఇచ్చారు.






## టమాటాలు ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే..

టమోటాలు లేకుండా వంట చేయడం ఎవరికీ సాధ్యం కాదు. చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం అని నిపుణులు హెచ్చరించారు. కాబట్టి టమోటాలు చెడిపోకుండా ఎలా సరిగ్గా నిల్వ చేయాలో ఇక్కడ తెలుసుకుందాం..

బాగా పండిన టమోటాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాటిని ఐదు రోజుల కంటే ఎక్కువ నిల్వ చేయకూడదట. అతి శీతల ఉష్ణోగ్రతలు టమోటాలలో కణ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. దీనివల్ల వాటి నాణ్యత తగ్గుతుంది. కాబట్టి మీరు వాటిని రెండు లేదా మూడు రోజుల్లో ఉపయోగించుకుంటే మంచిది. ఫ్రిజ్‌లో ఉంచవచ్చు లేదంటే వాటిని బయట గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిది. ఈ విధంగా మీరు టమోటాల పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు.

టమాటాలను వారం కంటే ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే ఏమవుతుంది?

సాధారణంగా టమోటాలను ఒక వారం కంటే ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే, అవి బయటి వైపు బాగా కనిపించవచ్చు కానీ లోపల కుళ్ళిపోవడం ప్రారంభించవచ్చు. వంటలో ఇటువంటి టమోటాలను ఉపయోగించడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. రిఫ్రిజిరేటర్‌లో అధిక తేమ వల్ల టమోటాలు మనకు తెలియకుండానే చెడిపోతాయి. ఇటువంటి టమోటాలు తినడం వల్ల అనారోగ్యం, వాంతులు, విరేచనాలు వస్తాయి. రోగనిరోధక శక్తి బలహీనపడటం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మీరు టమోటాలను తాజాగా ఉంచుకోవాలనుకుంటే వాటిని కొన్న వెంటనే కొన్ని రోజుల్లోనే ఉపయోగించడానికి ప్రయత్నించండి. ఫ్రిజ్‌లో నిల్వ చేసినప్పటికీ కూరగాయల కోసం కేటాయించిన డ్రాయర్‌లో ఉంచండి. టమాట లోపల నల్లటి మచ్చలు, దుర్వాసన ఉన్న టమోటాలను ఉపయోగించవద్దు.



## పేగులు సర్ఫ్ వేసి కడిగినట్లు క్లీన్ అవుతాయ్..

ఆముదం నూనెలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఆముదం నూనె (ఝుర్‌శీతీ శీఱశ్రీ) ను శతాబ్దాలుగా గృహ నివారణలలో ఉపయోగిస్తుంటారు. ఇది చర్మం, జుట్టు, జీర్ణ సమస్యలకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఆముదంలోని పోషకాలు శరీరంపై వివిధ ప్రభావాలను చూపుతాయి. అందుకే చాలా మంది దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటారు. ఆముదం గింజల నుండి తీసే నూనె.. మాయిశ్చరైజింగ్, యాంటీ-ఇన్ఫ్లమ్మేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా పేగు సమస్యలకు ఇది తరచుగా ప్రస్తావించబడుతుంది. శరీరం నుండి వ్యర్థాలను తొలగించడంలో పేగులు కీలక పాత్ర పోషిస్తాయి. వాటి సరైన పనితీరు చాలా ముఖ్యం. పేగు పనితీరు ప్రభావితమైనప్పుడు, మలబద్ధకం, గ్యాస్, కడుపులో బరువు పెరగడం వంటి సమస్యలు సంభవించవచ్చు. అటువంటి పరిస్థితులలో, చాలా మంది గృహ నివారణగా ఆముదం నూనెను ఆశ్రయిస్తారు.

అయితే, ఆముదం ప్రభావాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారవు.. తప్పుడు మోతాదును ఉపయోగించడం లేదా సరైన జ్ఞానం లేకుండా ఉపయోగించడం వల్ల సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల, దానిని ఉపయోగించే ముందు వెళ్లే ముందు ఆముదం -- ప్రేగుల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం . ఆముదం నిజంగా ప్రేగులను శుభ్రపరుస్తుందా.. లేదా..? ఎంత మోతాదు సముచితము..? అనే వివరాలను తెలుసుకుందాం..

ఆముదం నిజంగా పేగులను శుభ్రపరుస్తుందా?..

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన ఆయుర్వేద అధికారి డాక్టర్ ఆర్.పి. పరాశర్ వివరిస్తూ.. ఆముదంలో ప్రధానంగా రిసినోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఈ మూలకం పేగు కండరాలను సక్రియం చేయడానికి సహాయపడుతుంది.. ఇది ప్రేగు కదలికను వేగవంతం చేస్తుంది. ఆముదం తీసుకోవడం వల్ల ప్రేగు కదలిక పెరుగుతుంది.. అంతేకాకుండా.. కదలికలు సులభతరం అవుతాయి.అదనంగా, దీనిలో ఉండే కొవ్వు ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి. ఇది జీర్ణవ్యవస్థ ద్వారా ఆహారాన్ని తరలించడానికి సహాయపడుతుంది. అందుకే కొంతమంది దీనిని మలబద్ధకం కోసం ఉపయోగిస్తారు. అయితే, దీని ప్రభావాలు క్రమంగా కాకుండా సాపేక్షంగా వేగంగా ఉంటాయి. కాబట్టి మోతాదు, సరైన పద్ధతిని గుర్తుంచుకోవడం ముఖ్యం. సలహా లేకుండా అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల కడుపు తిమ్మిరి లేదా బలహీనత కూడా సంభవించవచ్చు.

ఏ సమస్యలలో ఆముదం ప్రయోజనకరంగా ఉంటుంది?

ఆముదం నూనెను ప్రధానంగా మలబద్ధకం చికిత్సకు ఉపయోగిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని, ఉదర భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని కూడా చెబుతారు. కొంతమందికి ఇది గ్యాస్, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగించడంలో కూడా సహాయపడుతుంది.

కీళ్ల నొప్పులు, చర్మం పొడిబారడానికి కూడా దీనిని స్థానికంగా ఉపయోగిస్తారు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, నెత్తిమీద పోషణను అందించడానికి కూడా ఆముదం నూనె ప్రసిద్ధి చెందింది. అయితే, దీని ప్రభావం వ్యక్తి నుండి వ్యక్తికి మారుతుంది.. దీర్ఘకాలిక ఉపయోగం సిఫార్సు చేయబడదు.

ఆముదం నూనె ఉపయోగాలు.. జాగ్రత్తల గురించి తెలుసుకోండి..

పరిమిత పరిమాణంలో మాత్రమే తీసుకోండి

ఖాళీ కడుపుతో తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించండి.

## టాప్ 5 లిస్ట్ చూస్తే షాకే..

భారత క్రికెట్ ప్రపంచంలో ఎందరో దిగ్గజాలు తమ బ్యాటింగ్‌తో రికార్డులు సృష్టించారు. అయితే కొన్నిసార్లు వ్యక్తిగత స్కోర్లు భారీగా ఉన్నప్పటికీ, జట్టుకు విజయం దక్కదు. వన్డే క్రికెట్ చరిత్రలో టీమ్ ఇండియా ఓటమి పాలైన మ్యాచ్‌ల్లో అత్యధిక శతకాలు నమోదు చేసిన భారత ఆటగాళ్ల వివరాలు ఇక్కడ ఉన్నాయి.

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. సచిన్ తన సుదీర్ఘ వన్డే కెరీర్‌లో మొత్తం 49 సెంచరీలు సాధించారు. అయితే, ఇందులో 14 సెంచరీలు భారత్ ఓడిపోయిన మ్యాచ్‌ల్లోనే నమోదయ్యాయి. సచిన్ ఒంటరి పోరాటం చేసినా, ఇతర ఆటగాళ్ల సహకారం లేక టీమ్ ఇండియా ఓడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.ప్రస్తుత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఈ లిస్ట్‌లో రెండో స్థానంలో ఉన్నారు. వన్డేల్లో అత్యధికంగా 50కి పైగా శతకాలు బాదిన రికార్డు కోహ్లీ పేరిట ఉంది. మొత్తం 53 వన్డే సెంచరీలలో, 8 శతకాలు భారత్ ఓటమి చెందినప్పుడు వచ్చాయి. కోహ్లీ క్రీజులో ఉన్నంతసేపు గెలుపుపై ఆశలు ఉన్నా, కొన్నిసార్లు ఫలితం భారత్‌కు అనుకూలంగా రాలేదు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. హిట్ మ్యాన్ తన వన్డే కెరీర్‌లో ఇప్పటివరకు 33 సెంచరీలు సాధించారు. రోహిత్ సెంచరీ చేస్తే భారత్ గెలుస్తుందనే నమ్మకం ఉన్నా, 7 సార్లు మాత్రం ఆయన సెంచరీ చేసినా భారత్ ఓటమిని చవిచూసింది.

4. శిఖర్ ధావన్, గంగూలీ, ద్రవిడ్: ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని ముగ్గురు దిగ్గజాలు పంచుకుంటున్నారు. శిఖర్ ధావన్ (మొత్తం 17 సెంచరీలు), సౌరవ్ గంగూలీ (22 సెంచరీలు), రాహుల్ ద్రవిడ్ (12 సెంచరీలు) తమ కెరీర్‌లో టీమ్ ఇండియా ఓడిన మ్యాచ్‌ల్లో తలా 4 సెంచరీలు చేశారు.భారత వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ ఇటీవల ఈ ప్రత్యేక జాబితాలో చేరారు. రాహుల్ తన వన్డే కెరీర్‌లో ఇప్పటివరకు 8 సెంచరీలు చేయగా, అందులో 3 సెంచరీలు భారత్ ఓడిపోయిన మ్యాచ్‌ల్లోనే రావడం గమనార్హం. మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ నిలకడగా ఆడుతున్నా, కొన్ని మ్యాచ్‌ల్లో జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు.

సెంచరీ అనేది ఒక ఆటగాడి ప్రతిభకు నిదర్శనం. అయితే క్రికెట్ అనేది టీమ్ గేమ్ కాబట్టి, వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు విజయం ముఖ్యం. అయినప్పటికీ, పైన పేర్కొన్న ఆటగాళ్లు తమ వంతు శ్రమించినా పరిస్థితులు అనుకూలించక టీమ్ ఇండియా ఓటమి పాలైంది. ఈ గణాంకాలు ఆయా ఆటగాళ్ల పోరాట పటిమను చాటిచెబుతాయి.



## 9 ఫోర్లు, 6 సిక్సర్లతో రోహిత్ బీభత్సం..

భారత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి పోరు జనవరి 18, ఆదివారం నాడు ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండటంతో అందరి కళ్లు టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మపైనే ఉన్నాయి. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు పెద్ద స్కోర్లు చేయలేకపోయిన రోహిత్, ఇండోర్ గడ్డపై మాత్రం తన విశ్వరూపం చూపిస్తాడని గణాంకాలు చెబుతున్నాయి.

హోల్కర్‌లో హిట్‌మ్యాన్ హవా..

ఇండోర్ స్టేడియం అంటే రోహిత్ శర్మకు ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం, పైగా బౌండరీలు చిన్నవిగా ఉండటం రోహిత్ లాంటి పవర్ హిట్టర్‌కు కలిసొచ్చే అంశం. గతంలో న్యూజిలాండ్ ఇక్కడ ఆడినప్పుడు రోహిత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.

ఆ పాత జ్ఞాపకాలు..

జనవరి 24, 2023న ఇదే వేదికపై న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ విధ్వంసం సృష్టించాడు. కేవలం 85 బంతుల్లోనే 101 పరుగులతో అద్భుత సెంచరీ బాదాడు. ఆ ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. కేవలం 41 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసిన రోహిత్, తర్వాతి 42 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్నాడు. ఆ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ (112) కూడా రాణించడంతో భారత్ 385 పరుగుల భారీ స్కోరు చేసి, 90 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది.ప్రస్తుత ఫామ్ ఎలా ఉంది?

ప్రస్తుత సిరీస్‌లో రోహిత్ ప్రదర్శన కొంచెం నిలకడగా ఉన్నప్పటికీ, భారీ ఇన్నింగ్స్‌లు రాలేదు. మొదటి రెండు వన్డేల్లో 26, 24 పరుగులు చేసి మంచి ఆరంభాలను పొందినప్పటికీ, వాటిని పెద్ద స్కోర్లుగా మలచలేకపోయాడు. అయితే, ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ 3లో ఉన్న రోహిత్ ఫామ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

తన చివరి 7 అంతర్జాతీయ వన్డే ఇన్నింగ్స్‌ల్లో 4 సార్లు 50కి పైగా పరుగులు చేశాడు.

ఇటీవల జరిగిన విజయ్ హజారే ట్రోఫీ (2025-26)లో సిక్కింపై 155 పరుగులతో వీరవిహారం చేశాడు.

కివీస్ బౌలర్లకు సవాలే..

నిర్ణయాత్మక మ్యాచ్‌లో రోహిత్ ఫామ్‌లోకి వస్తే కివీస్ బౌలర్లను ఆపడం ఎవరి తరమూ కాదు. పవర్ ప్లేలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే రోహిత్, ఇండోర్ చిన్న మైదానంలో సిక్సర్ల వర్షం కురిపించడం ఖాయంగా కనిపిస్తోంది. తన ఫేవరెట్ స్టేడియంలో మరో సెంచరీతో భారత్‌కు సిరీస్ అందించాలని రోహిత్ పట్టుదలతో ఉన్నాడు.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.